## క్లుప్తంగా

### శింగరకొండలో వెంకటేష్ పూజలు



పూజలు చేసిన అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్

అద్దంకి రూరల్: చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఆదివారం మండలంలోని శింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బీఫారం అందుకుని పూజలు చేయించినట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

### ప్రవేశ పరీక్షకు 201 మంది హాజరు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

చీరాల అర్బన్: చీరాలలో ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి అడ్మిషన్ కోసం జరిగిన ప్రవేశ పరీక్షలకు 201 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ జే సరళ ఆదివారం తెలిపారు. 247 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 201 మంది హాజరైనట్లు తెలిపారు. ఈపరీక్షల్లో ఉత్తీర్ణత చెందిన వారికి ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో చేర్చుకుంటారని చెప్పారు.

### వైభవంగా విద్యా గణపతి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విద్యాగణపతి

వేటపాలెం: స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీ ఎదురుగా ఉన్న విద్యా గణపతి దేవస్థానం ఏడో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యావాహచనం, రక్షాబంధనం, అష్టోత్తర శతనామార్చనతో అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డు శివప్రసాదరావు, పృధ్వీ ప్రన్నాంజనేయులు, పింజల రామ్మో హన్రావు, కాశీవిశ్వనాథ్, రామకృష్ణ పాల్గొన్నారు.

### ఈర్లగంగమ్మ వార్షిక తిరునాళ్ల రేపు

బల్లికురవ: భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బల్లికురవ సమీపంలోని ఈర్లగంగమ్మ వార్షిక తిరునాళ్లు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలతోపాటు అలంకరణ చేపడతామని బల్లికురవతో పాటు వివిధ గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## పేద ప్రజల అభ్యున్నతి
# జగనన్న పాలనలోనే

- కారంచేడు నాయకులతో పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ



వైఎస్సార్ సీపీలోకి చేరిన మసీదు పేట ముస్లిం కుటుంబాలు

కారంచేడు: రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతి కేవలం మన జగనన్న ప్రభుత్వ పాలనలోనే జరిగిందని.. ఇకపై కూడా జరుగుతుందని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం కారంచేడులో ఏర్పాటు చేసిన స్థానిక నాయకుల సమావేశంలో మాట్లాడారు. గతంతో ఎన్నడూ జరగని విధంగా ఇంటింటికీ జగనన్న సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఒక పేద వానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు ప్రతి గ్రామంలోను ఏర్పాటు చేశారన్నారు. ఒక ఇంటిలో రేషన్ కార్డు కావాలన్నా, ఓటు హక్కు కావాలన్నా, పింఛన్, ఇంటి స్థలం వంటి అనేక సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో పేద ప్రజలకు చేరువ చేశారన్నారు. మళ్లీ ఇదే జగనన్న పాలనకు మనమంతా కలసికట్టుగా పనిచేద్దామని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపైనే మనందరి ఓట్లు వేసి బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌కు, పర్చూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు మీ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈనెల 23వ తేదీన పర్చూరు తహశీల్దారు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలోని సీలోహు ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ ఎం సుదర్శనరావు ప్రార్థన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, మండల పార్టీ కన్వీనర్ దండా చౌదరిబాబు, జాగర్లమూడి చౌదరి, వెంపరాల సుబ్బారాయుడు, చాగంటి వాసు, యార్లగడ్డ శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీలోకి చేరిన 25 టీడీపీ ముస్లిం కుటుంబాలు..**

చినగంజాం: మండలంలోని మసీదు పేటకు చెందిన 25 ముస్లిం కుటుంబాలు ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరాయి. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో చీరాల క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ వారిని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికలలో ముస్లింలంతా ఐకమత్యంగా ఉండి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బాలాజీ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో చింతా సుబ్బారావు, రాజు పోలిరెడ్డి, ఏ శ్రీనివాసరెడ్డి, అంకిరెడ్డి, ఇసూబ్, సూభాని బాబు, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీలో చేరిన 30 బీసీ కుటుంబాలు**

మండలంలోని పెదగంజాం పంచాయతీ ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామం తెలుగు దేశం పార్టీకి చెందిన 30 బీసీ కుటుంబాలు ఆ పార్టీని వీడి ఆదివారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, పెదగంజాం ఎంపీటీసీ–2 యల్లావుల తిరుపతిరావు ఆధ్వర్యంలో వారంతా ఆదివారం చీరాల క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు యల్లావుల గోపి, ఆవుల వీరాంజనేయులు, ఆవుల గోపి, గడ్డం ప్రసాద్, మద్దిన కోటయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు, వీ అంకయ్య, వీ రాజు, వీ నాగాంజనేయులు, పీ రవితేజ, నక్కనల నాగేశ్వరరావు, గడ్డం జోష్, ఆవుల నాగరాజు, ఆవుల సాంబయ్య, ఆవుల శ్రీను, గడ్డం గోపిల కుటుంబాలు పార్టీలో చేరారు. వీరందరికీ బాలాజీ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు.



కారంచేడు చర్చిలో ప్రార్థనల్లో పాల్గొని మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ



బాలాజీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పెదగంజాం బీసీ కుటుంబాలు

## పార్టీ కోసం సమష్టిగా కలసి పనిచేస్తాం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్

- ఆశీర్వదిస్తే చీరాల మరింత అభివృద్ధి
- డాక్టర్ అమృతపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశం
- పాల్గొన్న అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్, ఎమ్మెల్యే కరణం



పాత చీరాలలో గ్రామస్తులతో మాట్లాడుతున్న వెంకటేష్

చీరాల రూరల్: పార్టీ అభివృద్ధి కోసం సమష్టిగా అందరిని కలుపుకొని కలసి పనిచేస్తా.. తనను ఆశీర్వదిస్తే చీరాల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో పయనింపచేస్తానని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక అమ్మ కంటి ఆస్పత్రి వద్ద ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, కరణం వెంకటేష్‌లు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ తన ఐదేళ్ల కాలంలో చీరాలను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయలేదన్నారు. ఆయన పరిపాలనలో ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నారని మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. అలానే చీరాలలో ఎమ్మెల్యేగా తన కుమారుడు వెంకటేష్‌ను, ఎంపీగా నందిగం సురేష్‌కు అత్యధిక ఓట్లువేసి గెలిపించాలని కోరారు.

**చీరాలను సీఎం జగన్‌కు బహుమతిగా ఇస్తాం..**

అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న తనపై ఎంతో నమ్మకంతో గొప్ప బాధ్యత అప్పగించారని, ఆబాధ్యతను తూచా తప్పకుండా అత్యధిక మెజార్టీతో గెలిచి జగనన్నకు కానుకగా ఇస్తానని చెప్పారు. నియోజకవర్గంలో అన్ని వర్గాలను కలుపుకుని ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావీయకుండా సమష్టిగా కలసి పనిచేస్తామని చెప్పారు. పార్టీతో పాటు అన్ని పదవులలో అందరికి సమప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ అమృతపాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పార్టీ ఏర్పాటు చేసిననాటి నుంచి తనతో పాటు తన అనుచరులు పార్టీని నమ్ముకుని ఉన్నామని చెప్పారు. అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ గెలుపు కోసం ఎవరినైనా ఎదిరిస్తామని, తుదివరకు పోరాడి గెలిపించుకుంటామని చెప్పారు. సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమ పథకాలే వెంకటేష్‌ను, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయని ఆయన ఎంతో ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అమృతపాణి యువసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కరణం, వెంకటేష్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చిమటా సాంబు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, నాయకులు దామర్ల శ్రీకృష్ణ, గోసాల ఆశీర్వాదం, నల్లబోతుల మోహన్ కుమార్‌ధర్మ, కామక్షి కేర్ అస్పత్రి ఎండీ తాడివలస దేవరాజు, దేవరపల్లి కుమార్ బాబు, గుద్దంటి సుధాకర్, షేక్ కబీర్, బండారు జ్వాలా నరసింహరావు, సంగుల జాన్ చిరంజీవి, నక్క పొలస్, టి. రత్నకుమార్, పేర్లి నాని, గోసాల అశోక్, దేవరపల్లి నరేష్, వేటపాలెం దాసు, గుమ్మడి చినబాబు, అర్జిల్లి ప్రసాద్, బొంతగొర్ల చంద్ర, పాల్గొన్నారు.

**అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన వెంకటేష్..**

చీరాల టౌన్: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని పాత చీరాల గ్రామంలోని శవనం వారిపాలెంలోని రాములవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదానం ఏర్పాటు చేయగా వెంకటేష్ ప్రారంభించారు. సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శవనం సత్యనారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల నాటికి టీడీపీ అడ్రస్ గల్లంతు



రావినూతలలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో చిన హనిమిరెడ్డి

- పార్టీలోకి వెల్లువలా వచ్చి చేరుతున్న టీడీపీ నాయకులు
- కండువా కప్పి ఆహ్వానించిన అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి



కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న హనినమిరెడ్డి

అద్దంకి: ఎన్నికల నాటికి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతు కాబోతోందని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. ప్రతి రోజూ ఐదు మండలాల నుంచి 100 సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, కుటుంబాలకు కుటుంబాలు టీడీపీని వీడుతున్నాయన్నారు. ఈక్రమంలోనే పట్టణంలోని 4వ, 7వ వార్డుకు చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయని చెప్పారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఒక్కడే ఒక పక్క నిలబడితే ఆయన్ను తట్టుకోవడం కోసం అన్ని పార్టీల నాయకులు ఏకం అయ్యారన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజాబలం మద్దతు ముందు నాయకుల బలం సరిపోదన్నారు. గెలవబోయేది వైఎస్సార్ సీపీయేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక..**

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన పది కుటుబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. మాజీ ఎంపీటీసీ చాట్ల వీరాంజనేయులు ఆధ్వర్యంలో పది కుటుంబాలకు చెందిన వారికి హనిమిరెడ్డి పార్టీ కండువాలను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### 20 మంది వలంటీర్ల రాజీనామా



మద్దతు తెలియజేస్తున్న వలంటీర్లు

సంతమాగులూరు (అద్దంకి): మళ్లీ తమ నాయకుడిని గెలిపించుకుని అప్పుడే వలంటీరుగా పనిచేయడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని, అప్పటి వరకూ వలంటీరు పదవికి రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు చెప్తున్నారు. ఈక్రమంలో తాజాగా సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన 20 వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేసి మండల నాయకుడు కైపు మహేశ్ రెడ్డిని కలిసి తమ మద్దతు తెలియజేశారు.

### నేడు అనంతవరంలో విగ్రహ పునఃప్రతిష్ట

యద్దనపూడి: నేడు సోమవారం అనంతవరంలో గంగా పార్వతీ సమేత భోగమల్లేశ్వరస్వామి దేవాస్థానంలో విగ్రహ పునఃప్రతిష్ట జరగనుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీ సమేత విగ్రహాలు, కళశ జీవధ్వజ ప్రతిష్ట మహోత్సవం జరగనుందని ప్రకటనలో చెప్పారు. కావున పరిసర గ్రామ ప్రజలు పెద్దఎత్తున ప్రతిష్టలో పాల్గొనాలని వారు కోరారు.

## ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ ప్రచారం



ఇంకొల్లు అంకమ్మ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఇంకొల్లు (చినగంజాం): మండల కేంద్రం ఇంకొల్లులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. మండల కన్వీనర్ బందారు ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అంకమ్మ కాలనీలో మండలస్థాయి , గ్రామస్థాయి నాయకులు ప్రచారం నిర్వహించారు. కాలనీలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రతి ఓటరుకు వైఎస్సార్ సీపీకి ఓటు వేయడం వలన కలిగే ప్రయోజనాలను గురించి తెలియపరుస్తూ తమ ప్రచారాన్ని కొనసాగించారు. మే 13న జరిగి ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని, పర్చూరులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ, బాపట్ల పార్లమెంట్‌కు నందిగం సురేష్‌ను గెలిపించుకోవాలని వారు ప్రతి ఒక్క ఓటరును అభ్యర్థించారు. కార్యక్రమంలో బండ్ల వెంకట సుబ్బారావు, తానికొండ ఎలియాజర్, చిగురుపాటి శ్రీనివాసరావు, మాలిక్, షంషుద్దీన్, కృష్ణుడు, శేషు స్థానిక కాలనీ నాయకులు,కే రంగయ్య, శ్రీను, అంకమ్మ, తన్నీరు రామారావు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ స్థాయి నాయకులు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## మహిళలతో నిశ్శబ్ద విప్లవం

- అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ సోదరి యడం లక్ష్మి



అంబేడ్కర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యడం లక్ష్మి

మార్టూరు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు కీలక పాత్ర పోషించడం ద్వారా నిశ్శబ్ద విప్లవానికి కారణం కాబోతున్నారని వైఎస్సార్ సీపీ నాయకురాలు, పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ సోదరి యడం లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మార్టూరు అంబేడ్కర్ కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె కాలనీ మహిళలతో సమావేశమై మాట్లాడారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కుతుందని ఆమె అన్నారు. సమాజంలో పురుషులతో సమానంగా ఉన్న మహిళలకు అన్ని రంగాలలో 50 శాతం పైగా అవకాశం కల్పించి మహిళలు పురుషులకంటే ఏ మాత్రం తీసిపోరని నిరూపించిన జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించుకోవటం కోసం అన్ని వర్గాలు కలిసి రావాలన్నారు. మే 13న జరిగే ఎన్నికలలో పర్చూరు ఎమ్మెల్యేగా యడం బాలాజీని, పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ నెల 23వ తేదీ తమ సోదరుడు యడం బాలాజీ పర్చూరులో నామినేషన్ వేయనున్న సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని వేలాదిగా తరలి వచ్చి సంఘీభావం తెలపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ఎంపీపీ భుక్యా శాంతిబాయి, సర్పంచ్ భుక్యా సునీతాబాయి, ఎంపీటీసీ అట్లూరి కళ్యాణి, జేసీఎస్ కన్వీనర్ జీ రవీచంద్, అట్లూరి సుగుణరావు, బండి ఎలీషా, జయపాల్, వెంకయ్య, గడ్డం మస్తాన్‌వలి, సులేమాన్, కొండ మస్తాన్, అరక గంగయ్య, చిమ్మిరిబండ శ్రీను, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## దైవ చింతన కలిగిఉండాలి

చీరాల రూరల్: మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు దైవ చింతన కలిగి ఉండాలని రెవరెండ్ కంచర్ల మార్టిన్ కుమారి అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్స్‌చర్చిలో మహిళల ఆదివారం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్ రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, అడిషనల్ పాస్టర్ రెవరెండ్ పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాచర్లకు చెందిన రెవరెండ్ మార్టిన్ కుమారి పాల్గొని దేవుని వాక్య సందేశాలు అందజేశారు. బైబిల్ గ్రంథంలో పొందుపరచిన అనేక మంది మహిళలు దేవుని ఎడల వారు కలిగిన భక్తి భావాలను గురించి వివరించారు. రోజువారి జీవన విధానంలో మహిళలు తమ బాధ్యతలతో పాటు దేవునియందు భయ భక్తులు కలిగి ఉన్నట్లయితే కుటుంబంతో పాటు సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆమె తన వాక్య సందేశంలో పేర్కొన్నారు. అనంతరం దేశక్షేమం గురించి, ప్రపంచ శాంతి గురించి, ప్రపంచంలో జరిగే యుద్ధ జ్వాలలు నిలిచిపోయి శాంతి యుత వాతావరణం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్ కుమార్, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్, సంఘస్థులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమాతో ధీమా

- పేదలకు కొండంత అండ
- రేషన్ కార్డుదారులకు వర్తింపు




వేటపాలెం: ప్రమాదవశాత్తు కానీ, సహజ మరణంతో కానీ ఇంటి యజమాని చనిపోతే ఏ పేద, సామాన్య కుటుంబం రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూపొందించిన ఈ పథకం అమలు బాధ్యతను పూర్తిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకుంది. గతంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పథకం అమలయ్యేది. అయితే సక్రమంగా అమలు జరగని కారణంగా కేంద్ర ప్రభుత్వం తన వాటా ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో మొత్తం ప్రీమియంను భరిస్తూ వైఎస్సార్ బీమా పథకాన్ని అమలుచేస్తోంది. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా రైస్ కార్డుల కలిగిన ప్రతి కుటుంబాన్ని పోషించే వ్యక్తి దుర దృష్టశాత్తు మరణించినా. ఆ వ్యక్తిపై ఆధార పడిన కుటుంబం రోడ్డున పడరాదని ఈ బీమా పథకం భారాన్ని ప్రభుత్వం తీసుకుంది. వలంటీర్ల ద్వారా అధికారులు సర్వే చేయించి లబ్ధిదారుల వివరాలు నమోదు చేసుకున్నారు. మండలంలో 23,072 తెల్లకార్డు దారులు ఉన్నారు. వీరందరికి బీమా వర్తిస్తుంది.

**పథకానికి అర్హులు వీరు..**

ఈ పథకంలో నమోదు కావాలంటే తప్పనిసరిగా రైస్ కార్డు ఉండాలి. కుటుంబాన్ని పోషించే వ్యక్తికే బీమా వర్తిస్తుంది. ఆ వ్యక్తికి భార్య 21 ఏళ్లు పూర్తికాని కుమారుడు, పెళ్లికాని కుమార్తె వితంతువు అయిన కూతురు బీమాదారుడితో ఉంటే బీమాదారునిపై ఆధారపడిన తల్లిదండ్రులు, వితంతువు అయిన కోడలు లేదా ఆమె పిల్లలు నామినీగా ఉంటారు. భర్త చనిపోతే ఆ స్థానంలో భార్య పేరున బీమా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేల లోపు ఆదాయం కలిగి ఉండాలి. మాగాణి 2.5 ఎకరాలు, మెట్ట 5 ఎకరాల్లోపు ఉండాలి. ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా ఉండాలి.

**ప్రయోజనాలివే..**

వైఎస్సార్ బీమా పథకంలో నమోదైన 18 నుంచి 50 ఏళ్ల వయస్సు వారు సహజ మరణం పొందితే రూ. 2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వర్తిస్తుంది. 51 నుంచి 60 ఏళ్ల వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 3 లక్షల బీమా వస్తుంది. బీమాదారుడికి గుర్తింపు కార్డు ఇస్తారు. క్లెయిమ్ సొమ్ము నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఈ ఖాతా ఎప్పుడూ వినియోగంలో ఉండాలి.

### రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్టూరు: మార్టూరు వైఎస్సార్ సీపీ నాయకుల సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం సాయంత్రం రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. డేర్ డెవిల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను గ్రామ ఉప సర్పంచ్ కాకోలు రామారావు ప్రారంభించారు. ఈపోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 20 టీంలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.30116, రూ.20116, రూ.10116 నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాకోలు రామారావు, సులేమాన్, గడ్డం మస్తాన్ వలి, రషీద్, కొండ మస్తాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సంతమాగులూరులో 20 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో మహేష్‌రెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలం పాత మాగులూరు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి గడ్డం వెంకటరెడ్డి కుమారుల ఆధ్వర్యంలో మండల పార్టీ ఇన్‌చార్జి కైపు మహేష్‌రెడ్డి సమక్షంలో ఆదివారం రాత్రి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాతమాగులూరు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.